క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో సోమ,మంగళవారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొక్కిరాయిలంక, పైడి చింతపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త విద్యుత్ లైను ఏర్పాటుకు గాను విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వివరించారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి రెండు రోజులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కామవరపుకోట: ద్వారకాతిరుమల దేవస్థానం ద్వారా నడపబడుచున్న స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చల్లా వేణుగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, 10వ తరగతి పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవ సందర్భంగా ఆదివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీతా మహాలక్ష్మి వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అధ్యక్షుడు జీఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ వృద్ధులను ఆదరించడం మన బాధ్యత అని అన్నారు. పిల్లలు పట్టించుకోకుండా నిర్లక్ష్యానికి గురవుతున్న వృద్ధులు రెవెన్యూ వారిని గాని లేదా స్వచ్ఛంద సేవా సంస్థలనుగాని ఆశ్రయించవచ్చని, వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు మండల న్యాయ సేవ అధికార సంస్థను ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అచ్యుత శ్రీనివాసరావు, బందారు లతాకుమారి, హరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు సమాజానికి సంపద

జంగారెడ్డిగూడెం: వృద్ధులు సమాజానికి సంపద అని వారిని కాపాడుకోవాలని బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపు నివారణ అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రామచంద్రరావు, త్రినాథరావు, బాలకృష్ణ, గాంధీ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పందుల సంచారం

- నియంత్రించలేకపోతున్న కార్పొరేషన్ అధికారులు
- వ్యాధులు వస్తాయని ఆందోళన చెందుతున్న ప్రజలు





నగరంలోని పలు ప్రాంతాల్లో మందలుమందలుగా పందులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో పందుల సంచారం నానాటికీ విచ్చలవిడిగా పెరిగిపోతోంది. ఎటువైపు అడుగు వేసినా పందులు మందలుమందలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పందులకు ఆలవాలంగా ప్రతి వీధీ ఉంటుంది. నగరంలోని ప్రతి పేటలో, ప్రతి వీధిలో చెత్తను ఎక్కడబడితే అక్కడ గుట్టలుగా వేస్తున్నారు. పందులు ఆ చెత్తకోసం గుంపులుగుంపులుగా చేరుకుంటున్నాయి. చెత్త ఉన్న ప్రాంతంలో కలియతిరుగుతూ చెత్తను చిందరవందర చేస్తూ అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా చెత్త వేసే ప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులు ×ఇది డంపింగ్ యార్డ్ కాదు, ఇక్కడ ఎవరూ చెత్త వేయవద్దు¥ అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ప్రజల్లో మార్పు కనిపించడంలేదు. గతంలో చెత్తనే సేకరించే క్లాప్ ఆటోలను నిలిపివేసిన కార్పొరేషన్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణలో విఫలం కావడంతో క్లాప్ ఆటోలను తిరిగి తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దీనితో ఈ మధ్య కాలంలో క్లాప్ ఆటోలు వీధుల్లో రెండురోజులకో, మూడు రోజులకో ఒకసారి దర్శనమిస్తున్నాయి.

పందులను నియంత్రణలో విఫలం

నగరంలో పందుల సంచారాన్ని కార్పొరేషన్ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా పందుల పెంపకందారులు పందులను వీధుల్లోకి వదలిపెట్టి అధికారులకు సవాలు విసురుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పందులను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నా పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బందిపై పందుల పెంపకందారులు దాడులకు తెగబడుతున్నారని అంటున్నారు. స్థానిక కార్పొరేటర్లను మంచి చేసుకుని వారికి నెలవారీ మామూళ్లు ఇస్తుండడం వల్ల కార్పొరేటర్లు కూడా పందులను నియంత్రించే పారిశుద్ధ్య కార్మికులను వారిస్తున్నారని కొందరు స్థానికులు చెబుతున్నారు. కార్పొరేటర్లే పందుల పెంపకందారులకు సహకరిస్తుంటే పందులను నియంత్రించడం ఎలా? సాధ్యం అవుతుందని శానిటరీ సూపర్‌వైజర్లు గగ్గోలు పెడుతున్నారు. ఓ పక్క అధికారుల నుంచి నియంత్రించాలని ఒత్తిడి, మరో పక్క కార్పొరేటర్ల నుంచి వారింపులు వస్తున్న నేపథ్యంలో సూపర్‌వైజర్లు ఏమి చేయాలో తెలియక జుట్టుపీక్కుంటున్నారు.

వర్షాకాలం భయం..భయం

నగరంలో పందుల సంచారం పెరిగిపోతుండడంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు రానున్న వర్షాకాలం గురించి ఆలోచిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పందులు విచ్చలవిడిగా ఉంటే అంటువ్యాధులు ప్రబలుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మురుగు మరింత పెరిగి ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోతే వీటిని నియంత్రించడం మరింత కష్టంగా మారుతుందని చెబుతున్నారు. ఇప్పుడే నియంత్రించలేని అధికారులు అప్పుడు ఇంక ఏం నియంత్రిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రజలంతా రోగాలపాలై నగరమంతా వ్యాధులు వ్యాపిస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పందులను నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మామూళ్ల మత్తులో ఉన్నారా..?



నగరపాలక సంస్థ అధికారుల్లో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక పక్క నగరంలో అక్రమ కట్టడాలను నియంత్రించలేకపోతున్నారు. మరో పక్క నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ చేయలేకపోతున్నారు. ఇప్పుడు పందుల సంచారాన్నీ నియంత్రించలేకపోవడం పాలనా వైఫల్యం కాక మరేంటి? అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా? అనే అనుమానం కలుగుతోంది. – రామనపూడి శివ, హిందూ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

బాలకృష్ణశర్మకు స్వర్ణకంకణ సన్మానం



బాలకృష్ణ శర్మకు సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేసి సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జ్యోతిష రంగంలో విశేష సేవలు అందిస్తున్న నగరానికి చెందిన గుడిమెట్ల బాలకృష్ణ కిశోర్ శర్మ అవధానికి స్వర్ణ కంకణ సన్మానం చేశారు. అంతర్జాతీయ వైదిక వేద విజ్ఞాన సమాఖ్య, విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆదివారం హైదరాబాద్ హబ్సిగూడలో నిర్వహించిన వైదిక జ్యోతిష సమ్మేళన కార్యక్రమంలో బాలకృష్ణ శర్మకు అతిథులు ఈ అరుదైన సన్మానం చేశారు. జ్యోతిష శాస్త్రంలో ప్రతిభ చూపుతూ జ్యోతిషశాస్త్ర మెళకువలను, ధర్మ సందేహాలను నివృత్తి చేస్తూ జ్యోతిష వాచస్పతిగా పేరుగడించారని అతిథులు కొనియాడారు. బాలకృష్ణ శర్మ మాట్లాడుతూ మనలో ఉన్న ప్రతిభ దేశానికి, సమాజానికి ఉన్నత స్థాయిలో ఉపయోగపడాలని ఇప్పటికే జ్యోతిష శాస్త్రానికి సంబంధించి 22 అవార్డులు తనకు లభించాయన్నారు. ఈ సమ్మేళనంలో మరో 2 గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు పొందడం ఆనందంగా ఉందన్నారు. విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ అధ్యక్షుడు గేదం విశ్వనాథ్, బిసీఏఎస్ ఛైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాస రావు, జ్యోతిష పండితుడు చక్రధర్ సిద్ధాంతి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పటిష్టానికి కృషి చేయాలి



జేపీతో కుప్పాల ఆంజనేయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి నాయకులు కృషి చేయాలని ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ ఏలూరు నగర కమిటీలో వివిధ పదవుల్లో ఇటీవల నియమితులైన పలువురు నాయకులు ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ)ని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జేపీని కలిసిన వారిలో నగర ప్రధాన కార్యదర్శిగా నియమించిన కుప్పాల ఆంజనేయులు, నగర ఉపాధ్యక్షుడిగా నియమించిన షేక్ రియాజ్ ఆలీ ఖాన్, నగర ఎక్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించిన కొట్టు నాగభూషణం ఉన్నారు. ఈ సందర్భంగా జేపీ వారిని ఆత్మీయంగా పలుకరించి పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని కోరారు. వారి వెంట నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కిలారపు శ్రీనివాసరావు, కగ్గ ప్రసాద్, ఇబ్బ ముసలయ్య, కుప్పాల రాంబాబు, తాడిపట్టి రాంబాబు, నక్క దినేష్, తాడిపట్టి రాజు, గండికోట రామకృష్ణ, గండికోట అప్పారావు,కర్నాటి జయరాం, గండికోట దుర్గారావు, రాష్ట్ర వాణిజ్య విభాగ జనరల్ సెక్రటరీ ఘంటా మోహన్ రావు, నగర బీసీ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, కొల్లిపాక సురేష్, చిట్టిబోయిన సాయిబాబు, గొర్ల రామారావు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్ట్



అరెస్ట్ అయిన నిందితులతో పోలీసులు

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో ఒక ఆయిల్ పామ్ తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. భీమడోలు సీఐ యుజే విల్సన్‌కు అందిన సమాచారం మేరకు ఆయన ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.39 వేలు నగదు, 11 సెల్ ఫోన్‌లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి



నేత్రవైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సెట్‌వెల్ సీఈఓ ప్రభాకరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేత్ర సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి చిన్న సమస్య వచ్చినా అది అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉందని సెట్‌వెల్ సీఈఓ కె.సూర్య ప్రభాకరరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం, ఉషా గ్రూపు సంస్థల అధినేత వీవీ బాలకృష్ణ సహకారంతో ఉచితనేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ప్రభాకర రావు నేత్ర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందడం ద్వారా అంధత్వానికి దూరంగా ఉండాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నేత్ర దానంపై అవగాహన కలిగి ఉండాలని, చనిపోయిన తరువాత నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించి తమ నేత్రాలకు పునర్జన్మ ఇవ్వచ్చన్నారు. ఈ సందర్భంగా 126 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించడానికి వేమగిరిలోని ఆసుపత్రికి తరలించారు. మరో 18 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ డెవలప్మెంట్ చైర్మన్ మేతర అజయ్ బాబు, పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గత 18 సంవత్సరాలుగా ప్రతినెలా మూడో ఆదివారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నేత్ర సమస్యలున్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానేపల్లి రామారావు

ఈకేవైసీ చేయించుకున్న రైతులకే అన్నదాత సుఖీభవ

చింతలపూడి: సబ్ డివిజన్‌లోని అర్హత కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాల్లో ఈ కేవైసీ చేయించుకోవాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ ఆదివారం సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందాలంటే ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదని చెప్పారు. రైతులు రైతు సేవ కేంద్రం వద్ద ఈకేవైసీ వేలిముద్ర వేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఏలూరు టౌన్: తాళం వేసిన ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారం నగలు గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయిన ఘటన ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని తూర్పు వీధి కల్పనా బేకరీ సమీపంలో కామాడ జాబిల్లి అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా జీవిస్తుంది. ప్రస్తుతం బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్గా పనిచేస్తున్నారు ఈ క్రమంలో ఆదివారం ఉదయం వ్యక్తిగత పనులు నిమిత్తం ఆమె ఇంటికి తాళాలు వేసి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉండాల్సిన 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించింది. వెంటనే ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. క్లూస్ టీం నమూనాల సేకరించే పనిలో నిమగ్నమైంది. బాధిత వృద్ధురాలు జాబిల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సమస్యలపై ఐక్యంగా పోరాడతాం



వీఆర్‌ఓల సంఘం ఆధ్వర్యంలో సమావేశంలో పాల్గొన్న వీఆర్‌ఓలు

దెందులూరు: సమస్యల పరిష్కారానికి ఐక్యంగా, ప్రణాళికబద్ధంగా పోరాడుతామని రెవెన్యూ అధికారుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు సాయిల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆర్ఎస్సార్ రాంబాబు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఏలూరు డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న సాయిల వెంకటేశ్వరరావును ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా రాంబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వీఆర్‌ఓలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానని పేర్కొన్నారు. వీఆర్‌ఓ గ్రేడ్ -1, గ్రేడ్ - 2లు అంతా ఐక్యంగా ఉండాలని, సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌కే అక్బర్, నూజివీడు, జంగారెడ్డిగూడెం అధ్యక్షులు శ్రీనివాసరావు, అడపా రాంబాబు, సభ్యులు పుట్ట అజయ్ బాబు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	34	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	48
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	36-45	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	27	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

జీతాల బకాయిలు చెల్లించాలి

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ తోర్లపాటి బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదివారం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత ఐదు మాసాల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, 15 నెలల పీఎఫ్ పెండింగ్‌లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ చింతలపూడి శాఖ అధ్యక్షురాలు టీ మరియమ్మ, నాగరాజు, కుమారి, వాణి, సీపీఐ మండల కౌన్సిల్ సభ్యులు ముల్లగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలోని చెట్ల నరికివేత

కొయ్యలగూడెం: కన్నాపురం పంచాయతీ మహాదేవపురం గ్రామంలో ఆదివారం చెట్లు నరికి వేయడం వివాదాస్పదమైంది. పంచాయతీ వాటర్ ట్యాంకు ఉన్న ప్రాంతంలో సుమారు ఇరవై సెంట్లకి పైగా ఉన్న స్థలంలో కొందరు వ్యక్తులు విలువైన జామాయిల్, మారుజాతి కలపను నరికి వేశారని రైతులు ఆరోపించారు. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని, చెట్లు అక్రమంగా నరికిన వ్యక్తులు ప్రభుత్వ సెలవు రోజుల్లో కావాలనే ఈ దుశ్చర్యకు ఒడికట్టారని స్థానికులు ఆరోపించారు. దీనిపై పంచాయతీ శాఖ అధికారులు విచారణ చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహాదేవపురం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

స్థానిక ప్రజా ప్రతినిధులకు 'కూటమి' షాక్

- తల్లికి వందనం పథకం నిలిపివేత
- రూ.3 వేలు గౌరవ వేతనం పొందడమే కారణమా ?
- గత ప్రభుత్వంలో అన్ని పథకాలు వర్తింపు



ఏలూరు మండల పరిషత్ సమావేశంలో సర్పంచులను తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించడంపై నిలదీస్తున్న సర్పంచులు (ఫైల్)

దెందులూరు: తల్లికి వందనం పథకం నిబంధనల అమలులో కూటమి ప్రభుత్వం స్థానిక ప్రజా ప్రతినిధులకు మొండి చేయి చూపింది. ఈ పథకం రూ.3 వేల గౌరవ వేతనం అందుకుంటున్న గ్రామ సర్పంచులకు శాపంగా మారిందని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక నేతలను ఏ ప్రభుత్వ పథకాలకూ అనర్హులను చేయలేదు. దెందులూరు నియోజకవర్గంలో జాలిపూడి గ్రామ సర్పంచ్ నవ్య కుమారుడికి తల్లికి వందనం పథకం వర్తింప చేయలేదు. తిరస్కరించిన కారణం సర్పంచ్‌ను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించి, సమాచారం పంపారు. గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం ఎస్సీ, బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన సర్పంచులు, ఎంపీపీలు జెడ్పీటీసీలే ఉన్నారు.

సర్పంచ్‌ల సంఘాల ఆగ్రహం

ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటున్న కారణంగా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా కూటమి ప్రభుత్వం పరిగణించి తల్లికి వందనం పథకంలో అనర్హులుగా అధికారికంగా గుర్తించడంపై సర్పంచ్ సంఘాలు, దళిత గిరిజన మైనారిటీ వర్గాల ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల జరిగిన ఏలూరు మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు అధికారులను నిలదీశారని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు అయితే వారి మాదిరిగా అన్ని రాయితీలు వర్తింపజేస్తారా అని సర్పంచులు పట్టుబట్టారు. ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి తల్లికి వందనం అమలులో స్థానిక ప్రజా ప్రతినిధులను అర్హులుగా ప్రకటించాలని కోరుతున్నారు.

నా కుమారుడికి తల్లికి వందనం రాలేదు



నా కుమారుడికి తల్లికి వందనం పథకం వర్తింపజేయలేదు. తిరస్కరించిన కారణం నన్ను ప్రభుత్వ ఉద్యోగి అని నిర్ధారించారు. ఇది చాలా బాధాకరం. గౌరవ వేతనం తీసుకున్న వాళ్లు ప్రభుత్వ ఉద్యోగులు ఎలా అవుతారు. అకారణంగా మమ్మల్ని అనర్హులు చేశారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రతినిధులకు తల్లికి వందనం పథకం అమలు చేయాలి.
– నవ్య, గ్రామ సర్పంచ్, జాలిపూడి

గత ప్రభుత్వంలో ఇలా జరగలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి నిబంధన లేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకానికైనా అర్హులైతే వారు ఏ రాజకీయ పార్టీ అని చూడకుండా కచ్చితంగా అందరికీ పథకం అమలు చేయాలని పదేపదే చెప్పారన్నారు. కానీ మొదటి సంవత్సరంలోనే కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం తీసుకుంటున్నామనే సాకుతో తల్లికి వందనం పథకం ఆపడం తీవ్ర బాధాకరం. ఇది సరైన నిర్ణయం కాదు.
– అప్పన పద్మావతి, వైస్ ఎంపీపీ, పెదపాడు

కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి



స్థానిక ప్రజా ప్రతినిధుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించకపోవడం బాధాకరం. ఈ రకమైన నిర్ణయం తీసుకోవడం తగదు. దీనిపై కూటలమి ప్రభుత్వం తక్షణమే స్పందించి పురనాలోచించాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగానే పథకం అమలు చేయాలి.
– పర్వతనేని శ్రావణి సుధీర్, సర్పంచ్, రామారావుగూడెం